క్లుప్తంగా

సీపీఐ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పాతమంచిర్యాల: ఈ నెల 20నుంచి 22 వరకు హైదరాబాద్ మేడ్చెల్‌లో నిర్వహించే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, ముస్కె సమ్మయ్య, మిరియాల రాజేశ్వర్‌రావు, దేవి పోచన్న, మొగిలి లక్ష్మణ్, మామిడి గోపి, ఆంజనేయులు, దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

చర్చి కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ కృష్ణకాలనీ సీ జోన్ ఏరియా సీఎస్ఐ వెస్లీ చర్చి నూతన కమిటీని ఎన్నుకున్నారు. చర్చిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సెక్రటరీగా జంజిపల్లి సత్యం శ్యామల్, స్టీవార్డ్‌గా కామెర్ల వినయ్ ప్రశాంత్, ట్రెజరర్‌గా ఆర్. అశోక్, ఉమెన్స్ ప్రెసిడెంట్‌గా స్వప్నరాణి, సెక్రెటరీగా కామిల్లా సువర్ణ ప్రశాంత్, ఫండ్ సెక్రెటరీగా ముద్దుమల్ల సంతోశ్‌కుమార్, సభ్యురాలిగా బొంకూరి వరకుమారి, ప్రాపర్టీ సెక్రెటరీగా సంతపూరి వినయ్, ఎకలాజికల్ సెక్రటరీగా బొంకూరి విజయ్‌కుమార్, సండే స్కూల్ సెక్రెటరీగా లీలా సంతోష్, సండే స్కూల్ టీచర్‌గా కే.స్వప్న, యూత్ సెక్రెటరీగా శాంతి సాగర్, ప్రెస్ ఇన్‌చార్జీగా కే.సురేష్ ఎన్నికయ్యారు.

'రక్తదానం చేస్తే సమాజానికి మేలు'

చెన్నూర్: రక్తదానం చేస్తే సమాజానికి మేలు జరుగుతుందని వైద్యులు కుదుషా అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్, రెడ్‌క్రాస్ సొసైటీల సౌజన్యంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై వైద్యులు మాట్లాడారు. రక్తదానం చేస్తే ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదానం చేసిన వారవుతారని పేర్కొన్నారు. రక్తదాన శిబిరానికి యువకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. 48మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, చెన్నూర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు జాడి తిరుపతి, జోనల్ చైర్‌పర్సన్ వెంకటేశ్వర్, సభ్యులు పాల్గొన్నారు.

సహకారం అందించాలి

మంచిర్యాలఅర్బన్: సంస్థ ఆధ్వర్యంలో నారాయణతోడులో నిర్వహించే అన్నదాన మందిరం, తెలంగాణ రాష్ట్రం తరుపున రెండు వందల మంది స్వాములు సేద తీర్చుకునే విధంగా హాల్ నిర్మాణానికి సహాయసహకారాలు అందించాలని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్‌రావ్ తెలిపారు. మంచిర్యాలలో ఏబీఏపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. అన్నదానం కార్యక్రమానికి చేయూతనందించాలని ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఏబీఏపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. అక్టోబర్ 31లోపు తెలంగాణలోని అన్ని జిల్లాల కమిటీల ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలిపారు. గోదావరిఖనికి చెందిన చల్లా రవీందర్‌రెడ్డిని నూతనంగా తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా నియమించారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ పునఃర్‌నిర్మాణంలో భాగంగా కార్యదర్శి భాస్కర్, కోశాధికారి పోతురాజుల రమేష్‌తో పాటు 25మంది సభ్యులతో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అన్నదానం కార్యక్రమానికి చేయూతనివ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

ఘనంగా పోలేరమ్మ బోనాల జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని గణేశ్‌నగర్‌లో ఆదివారం పోలేరమ్మ బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. రెల్లి కులస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా వచ్చి జీటీ హాస్టల్ సమీపంలో గల ఆలయం వద్ద అమ్మవారికి బోనాలు సమర్పించారు. జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మట్టిరోడ్డే దిక్కు..!



కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి-కొత్తపల్లి రాజారం గ్రామాల మధ్య అటవీ అనుమతులు రాకపోవడంతో గ్రామానికి మట్టి రోడ్డే దిక్కైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ మట్టిరోడ్డుపై గుంతలు ఏర్పడి, బురదగా మారి వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం స్పందించడం లేదు. ఎన్నికల సమయంలో గ్రామస్తులు రోడ్డు బాగుచేయాలని ఓట్లు బహిష్కరిస్తే మంత్రి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అధికారంలోకి వస్తే రోడ్డు, వైద్యం, విద్య సదుపాయాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. కానీ అవి నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డెక్కిన సాగునీరు



దండేపల్లి: మండల కేంద్రం సమీపంలో డిస్ట్రిబ్యూటరీ 28 కాల్వలో ఆదివారం చెత్త తట్టుకుంది. దీంతో నీళ్లన్ని, కాల్వ గట్టుపై నుంచి సమీపంగా ఉన్న లక్సెట్టిపేట-నిర్మల్ రహదారిపై ప్రవహించింది. సాగునీరంతా రోడ్డుపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత రైతులు చెత్తను తొలగించడంతో, నీళ్లు రోడ్డుపైకి రాకుండా అయ్యాయి.

రక్షణ కంచె సరిచేయరూ..!



భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామంలో స్కూల్ వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఎప్పుడూ రాకపోకలు జరిగే ఈ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ వేసిన రక్షణ కంచె ధ్వంసమైంది. ప్రజలకు, పశువులకు ఎలాంటి ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి రక్షణ కంచె సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

వీడుతున్న చిక్కుముళ్లు!

- భూసమస్యల పరిష్కారానికి అధికారుల కసరత్తు
- పరిశీలనలో 'భూ భారతి' దరఖాస్తులు
- ఈ నెల 15లోపు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాలు

భూభారతి సదస్సుల్లో	
వచ్చిన దరఖాస్తులు	7,845
తిరస్కరణకు గురైనవి	1,241
నోటీసులు జారీ చేసినవి	7,823
పరిష్కారమైనవి	915
పరిశీలనలో ఉన్నవి	5,661



దండేపల్లి: మామిడిపల్లిలో భూభారతి దరఖాస్తులు పరిశీలిస్తున్న సిబ్బంది (ఫైల్)

దండేపల్లి: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. భూభారతి సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిశీలనను ఈ నెల 15నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రెవెన్యూశాఖ ఆ దిశగా అడుగులు వేస్తోంది. మంచిర్యాల రెవెన్యూ డివిజన్‌లో ఒక్కొక్కటిగా భూ సమస్యలు చిక్కుముళ్లు వీడుతున్నాయి. మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యే వాటిపై దృష్టిపెట్టారు. విరాసత్, మిస్సింగ్ సర్వే నంబర్లతో పాటు, డీఎస్ పెండింగ్, పేరు, కులం, తప్పొప్పుల సవరణతో పాటు, భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు వంటి వాటిని తహసీల్దార్ల సమక్షంలో పరిశీలించి అర్హత కలిగిన వారికి పట్టాపాసుబుక్‌లు జారీ చేస్తున్నారు.

గ్రామాలు, మండలాల వారీగా..

నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు దరఖాస్తుల పరిశీలన పనులు పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మండలాల వారీగా వచ్చిన సమస్యల వివరాలు తీసుకున్నారు. అందులో గ్రామస్థాయిలోకి వెళ్లి ముందుగా సులువుగా పరిష్కారమయ్యే వాటికి ప్రాధాన్యమిస్తున్నారు. భూ విస్తీర్ణాల్లో హెచ్చుతగ్గులు ఉంటే వాటికి సంబంధించిన దరఖాస్తు దారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. మిస్సింగ్ సర్వే నంబర్లు, పట్టాభూమి ఉండి నిషేధిత జాబితాలో చేరిన వాటిపై దృష్టిసారిస్తున్నారు. ఆర్ఐ, తహసీల్దార్, ఇతర సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్తున్నారు. సమస్య తీవ్రతను బట్టి, ఆర్డీవోకు, కలెక్టర్‌కు లాగిన్ చేస్తున్నారు. అసైన్డ్ భూములు, సాధా బైనామాలు పక్కన పెడుతున్నారు. వీటిని తదుపరి ప్రభుత్వ ఆదేశాల అనంతరం పరిష్కరించనున్నట్లు సమాచారం.

> **15 లోపు పూర్తికి చర్యలు**
>
> భూ భారతి సదస్సుల్లో భూసమస్యలపై వచ్చిన దరఖాస్తులు, పరిశీలన ప్రకియను ఈ నెల 15లోగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాం. మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారమవుతున్న వాటికి పట్టాపాస్‌బుక్‌లు జారీ చేస్తున్నాం. సాధాబైనామాలు, అసైన్డ్ భూముల సమస్యలను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరిష్కరిస్తాం.
>
> – శ్రీనివాసరావు, ఆర్డీవో, మంచిర్యాల

విద్యుత్ అధికారుల 'పొలంబాట'



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెన్నెల: మండలంలోని ఆవుడం, గంగారాం గ్రామాల్లో ఆదివారం విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. మోటార్లకు, వ్యవసాయ బోరుబావుల వద్ద కెపాజిటర్లు బిగించుకోవాలని రైతులకు సూచించారు. కెపాసిటర్లు పెట్టుకోవడం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. ఓల్టేజీ హెచ్చుతగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్‌లు, విద్యుత్ వినియోగం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కరెంట్ విషయంలో ఎలాంటి సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వర్షాకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సబ్ ఇంజనీర్ పవన్, లైన్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్, అసిస్టెంట్ లైన్‌మెన్ రాజయ్య, రైతులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

పాతమంచిర్యాల: బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. బీసీలు తమ వాటా కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారని, చట్టబద్ధంగా వారికి దక్కాల్సిన హక్కులు, రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గజెల్లి వెంకటయ్య, బీసీ మేధావుల ఫోరం నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, రజక సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మేడిపల్లి రాజు, సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధూలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ బహిరంగ సభ విజయవంతం చేయండి

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(ఏబీకేఎంఎస్), బీఎంఎస్‌ల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4గంటలకు నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కుంటాల శంకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీఎంఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. బహిరంగ సభకు జాతీయ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి, బీఎంఎస్ రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. సింగరేణి గని కార్మికులు, అసంఘటిత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మద్దూరి రాజుయాదవ్, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు రత్నాకర్, సంగెం లక్ష్మణ్, దుర్గం రాజమల్లు, మధు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం చేపడుతున్న ఆందోళన కార్యక్రమంలో భాగంగా సోమవారం సీసీసీ కార్నర్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు బీఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి రాగం రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'ప్రతీ కార్యకర్త ఇంటిపై జెండా ఎగురవేయాలి'



మాట్లాడుతున్న అమిరిశెట్టి రాజ్‌కుమార్

పాతమంచిర్యాల: పట్టణంలో ప్రతీ కార్యకర్త ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు పాలాభిషేకం చేయాలని, ఆపరేషన్ సిందూర్ గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. జాతీయ భావాలను ప్రతి ఒక్కరిలో నింపే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ముదాం మల్లేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నాయకులు బింగి సత్యనారాయణ, రెడ్డిమల్ల అశోక్, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత



మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని రామన్‌కాలనీ సమీపంలోని రైల్వేఓవర్ బ్రిడ్జిపై కొంత కాలం క్రితం ప్రమాదకర గుంత ఏర్పడింది. అధికారులు ఎవ్వరూ పూడ్చకపోవడంతో స్పందించిన స్థానిక ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఆదివారం సొంత ఖర్చుతో గుంతను పూడ్చారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అజీమొద్దీన్, నాయకులు ప్రభుదేవ్, నందిపాటి రాజ్‌కుమార్, గాండ్ల సంజీవ్, జావీద్ పాష తదితరులు ఉన్నారు.

'బహుజన రాజ్యాధికారం కోసం పోరాడుదాం'

పాతమంచిర్యాల: బీసీలు బహుజన రాజ్యాధికారం కోసం పోరాటం చేద్దామని బీసీ జేఏసీ ఒడ్డెపల్లి మనోహర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ నెల 20న జిల్లా కేంద్రంలో నిర్వహించే బీసీ రాజ్యాధికార సభ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. జిల్లాలోని బీసీ సంఘాల నాయకులు, విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'కౌలు రైతులకు సరిపడా యూరియా అందించాలి'

కోటపల్లి: చిన్న, కౌలు రైతులకు సరిపడా యూరియా ఎరువులను అందించాలని బీజేపీ మండల అధ్యక్షురాలు పెద్దింటి స్వప్న అన్నారు. కోటపల్లి మండలకేంద్రంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని, రైతులకు సరిపడా యూరియాను అందించడంలేదన్నారు. పది, ఇరవై ఎకరాలు ఉన్న పట్టాదారులు భూములను కౌలుకు ఇచ్చుకొని యూరియా బస్తాల కోసం పట్టాలు చూపించి యూరియా బస్తాలు తీసుకుంటున్నారని, ఆ బస్తాలను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. చిన్న, కౌలు రైతులకు యూరియా బస్తాలు అందడంలేదని, ఇదే పద్ధతి కొనసాగితే ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సబ్సిడీతో యూరియాను రైతులకు సరఫరా చేస్తుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తూ భూస్వాములకే యూరియా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పెద్దింటి పున్నం, జనరల్ సెక్రటరీ కందుల వెంకన్న, కార్యదర్శి దుర్గం సంధ్య, బూత్ అధ్యక్షుడు శ్యాంసుందర్, నాయకులు నర్సింహులు, చంద్రయ్య పాల్గొన్నారు.

పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ



బోనాల ఊరేగింపులో భక్తులు

కోటపల్లి: మండలంలోని జనగామలో పోచమ్మ ఆలయాన్ని పునర్‌నిర్మించి ఆదివారం పోచమ్మ విగ్రహాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని గ్రామాలతో పాటు చెన్నూర్, గోదావరిఖని, శ్రీరాంపూర్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ అమ్మవారి పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్, కుమ్మరి సంతోశ్, మాజీ ఎంపీటీసీ తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, నాయకులు

ఏటీఎం పనిచేయక ఇబ్బందులు



భీమారం: మండలంలోని అన్ని గ్రామాలకు ఉపయోగపడే భీమారంలోని స్టేట్ బ్యాంక్ ఇండియా ఏటీఎం పనిచేయకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిరోజులుగా ఏటీఎం ద్వారా డబ్బులు రాకపోవడంతో నగదు కోసం చెన్నూర్ వెళ్తున్నారు. మండలంలోని 11గ్రామాలకు చెందిన ప్రజలు భీమారంలోని ఏటీఎంపైనే ఆధారపడాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఏటీఎం మిషన్‌లో టెక్నికల్ లోపాలు ఏర్పడంతో 15రోజులుగా మూసి ఉంచారు. ప్రజల కష్టాలు దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతు



మొరం వేసి చదును చేయిస్తున్న రమేశ్

భీమారం: మండల కేంద్రం నుంచి తాళ్లగూడెం వరకు ధ్వంసమైన రోడ్డుకు మాజీ సర్పంచ్ దర్శనాల రమేశ్ తన సొంత ఖర్చులతో ఆదివారం మరమ్మతు చేపించారు. గతంలో నిర్మించిన రోడ్డుకు మరమ్మతు చేయకపోవడంతో వాహనదారులు రోడ్డు పై ప్రయాణించాలంటే నానా అవస్థలు పడ్డారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రమేశ్ ట్రాక్టర్ల ద్వారా మొరం తెప్పించి, గుంతలు పడ్డ చోట వేసి మరమ్మతు చేపట్టారు. రోడ్డు సమస్యను తీర్చినందుకు ప్రజలు రమేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.